సాక్షి తిరుపతి

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజలు వివిధ సమస్యలప గ్రీవెన్స్ అందించే వినతుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. - 8లో



ప్రజా ఉద్యమానికి దిశానిర్దేశం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపట్టేందుకు కృషి చేయాలని మోహిత్‌రెడ్డి సూచించారు. - 8లో



స్త్రీనిధి పోస్టర్ ఆవిష్కరణ

స్త్రీనిధి రుణ వాయిదాల వివరాలతో కూడిన పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఆవిష్కరించారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,424 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,872 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కాను కల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారిరిక 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన వారికి క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

15 నుంచి పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో రెండేళ్ల కాల వ్యవధి గల అలైడ్ హెల్త్ సైన్స్ పారామెడికల్ డిప్లొమా కోర్సులకు ఈ నెల 15వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఎస్వీ వైద్య కళాశాలలో మొత్తం సీట్లు 60 అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీలో 30 సీట్లు, అనస్థీసియా టెక్నాలజీలో 30 సీట్లు ఉన్నాయని వివరించారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నేడు చెన్నై- నెల్లూరు మెమో రైలు రద్దు

నాయుడుపేటటౌన్ : చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే మెమో రైలును మంగళవారం పూర్తిగా రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి సోమవారం తెలిపారు. తడ, సూళ్లూరుపేట ప్రాంతాల్లో రైల్వే లైన్ల మరమ్మతుల కారణంగా రైలును రద్దు చేశామని వెల్లడించారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

టీటీడీకి రూ.1.05 కోట్ల విరాళం



డీడీ అందిస్తున్న రాకేష్ రెడ్డి

తిరుమల: టీటీడీ ట్రస్టులకు సోమవారం రూ.1.5 కోట్ల విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన ఏడీఓ ఫౌండేషన్ వారు ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.75 లక్షలు విరాళంగా అందించారు. ఈమేరకు ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు డీడీని అందజేశారు. బెంగుళూరుకు చెందిన ఎం.రాకేశ్ రెడ్డి అనే భక్తుడు టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించారు. డీడీని టీటీడీ చైర్మన్‌కు అందజేశారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పల గిరిధర్ అనే భక్తుడు సైతం బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు అందించారు. ఈ మేరకు దాత టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి విరాళం డీడీ అందజేశారు. గుంటూరుకు చెందిన సింహాద్రి వెంకట శివ ప్రసాద్ అనే భక్తుడు ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,00,116 విరాళం అందించారు.

నారా.. నకిలీ సారా

టీడీపీ నేతలు సాగిస్తున్న నకిలీ మద్యం దందాపై వైఎస్సార్‌సీపీ నేతలు..కార్యకర్తలు మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా నిరసనలు.. ర్యాలీలతో హోరెత్తించారు. నారా వారి కల్తీ లిక్కర్‌ను నిర్మూలించాలి.. కేసును సీబీఐకి అప్పగించాలి అంటూ నినదించారు. ఎక్సైజ్ కార్యాలయాల వద్ద బైఠాయించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి ముడుపులు కరకట్ట బంగ్లాకు చేర్చారని ఆరోపించారు. పచ్చమూకే నిందితులని తెలిసినా కేసును నీరుగార్చేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.వేలకోట్ల స్కామ్‌కు పాల్పడిన పెద్దలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.



నగరిలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి రోజా, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

జిల్లాలో కల్తీ మద్యంపై నిరసనల హోరు

- కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఎక్సైజ్ కార్యాలయాల వద్ద ధర్నా
- కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్

తిరుపతి అర్బన్ : ''నకిలీ మద్యంతో ప్రజల ఉసురుపోసుకోవద్దు. కాసుల కోసం అక్రమాలకు పాల్పడవద్దు. పేదల ప్రాణాలతో చెలగాటమాడవద్దు. కల్తీ లిక్కర్ దందా కోసం కుటుంబాల్లో చిచ్చుపెట్టవద్దు'' అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భగ్గుమన్నారు. సోమవారం ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ఆందోళనకు దిగారు. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే నకిలీ మద్యం దందా సాగిందని ఆరోపించారు. రూ.కోట్ల ముడుపులు చేతులు మారిన ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.



సూళ్లూరుపేటలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : వైఎస్సార్‌సీపీ సూళ్లూరుపేట సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాయుడుపేటలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నకిలీ మద్యం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఆదాయం వైపే ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేదల ప్రాణాలను తృణప్రాయంగా చూస్తోందని విమర్శించారు. ప్లకార్డులను చేతపట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.



చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు

చంద్రగిరిలో..

చంద్రగిరి : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నకిలీ మద్యంపై నిరసన చేపట్టారు. స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ కార్యాలయం వద్ద మద్యం బాటిళ్లతోపాటు ప్లకార్డులు, ఫ్లెక్సీలను చేతపట్టుకుని ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేనివిధంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, నకిలీ మద్యం విక్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీకాళహస్తిలో..

- **శ్రీకాళహస్తి :** పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. పాఠశాలలు, ఆలయాల సమీపంలో సైతం వైన్‌షాపులను ఏర్పాటు చేశారని విమర్శించారు. వాడవాడలా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాత్రాస్థలం అని విచక్షణ కూడా లేకుండా రాత్రింబవళ్లు మద్యం విక్రయాలు సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ సరిపోనట్లు కల్తీ మద్యం దందా చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాల బోర్డు మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పార్టీ నేతలు ఉన్నం వాసుదేవనాయుడు, ఓడూరు గిరిధర్‌రెడ్డి, పఠాన్ ఫరీద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించారు.
- **వెంకటగిరి :** పట్టణంలోని నేదురుమల్లి నివాసం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నేతలు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యం మాకొద్దు బాబు...పేదల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు బాబు అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో నేతలు, మహిళలను కార్యాలయంలోకి రాకుండా ఎక్సైజ్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఇంతలో ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ బయటకు వచ్చి వైఎస్సార్‌సీపీ నేతల నుంచి వినతిపత్రం తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ సెక్రటరీ కోడూరు కల్పలత, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు కాటూరు రామతులసి పాల్గొన్నారు.
- **సత్యవేడు :** నాగలాపురంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వం వ్యాపారం చేస్తుందని ఆరోపించారు. దీంతో ప్రజలు ప్రాణాలు పోగొట్టుకునే దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. సత్యవేడు నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా బెల్ట్ షాపులు, నకిలీ మద్యం విక్రయాలతో పేదలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్రవర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షులు బొర్రా మాధవీరెడ్డి పాల్గొన్నారు.

గుడి.. బడి పక్కనే వైన్‌షాపులు

కూటమి ప్రభుత్వంలో గుడి, బడి అని లెక్క లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. కోట్ల రూపాయలు సంపాదనే లక్ష్యంగా నకిలీ మద్యం తయారుచేస్తున్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో బెల్టు షాపులు పెట్టి నకిలీ మద్యంతో మందు బాబుల ప్రాణాలు తీస్తున్నారు. ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో వంద బెల్టు షాపులను గుర్తించాం.

– చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త

నగరిలో..

నగరి : పట్టణంలో మాజీ మంత్రి ఆర్ రోజా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యం స్కామ్‌పై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నారా వారి సారా పాలన నశించాలని నినాదాలు చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందించారు. నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు బాలన్, జయప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు తీస్తుంటే పవన్ ఏమయ్యారో?

ఎన్నికల ముందు మద్యపాన ప్రియుల పొట్ట కొడతారా అంటూ పవన్‌కళ్యాణ్ ఊగిపోయారు. మరి నేడు మద్యం ప్రియుల ప్రాణాలు తీస్తున్నారు. వారికోసం ఎందుకు ఆవేశంతో ఊగడం లేదు. ఈ ప్రభుత్వంలో కల్తీ మద్యం స్కామ్ జరిగి రెడ్ హేండెడ్‌గా పట్టుబడితే ఇది వైఎస్సార్‌సీపీ కుట్ర అనేవారికి ఇంగిత జ్ఞానం ఉందా? వైఎస్‌ఆర్‌సీపీ కోవర్టులు చేస్తున్నారని చెప్పే చంద్రబాబు తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ టికెట్ శంకర్‌యాదవ్‌కు ఇవ్వకుండా జయచంద్రా రెడ్డి ఎందుకు ఇచ్చారు. ఎన్నికలు ముగిసిన 16 నెలల వరకు జయచంద్రా రెడ్డి ఎవరి మనిషి అనేది మీకు తెలియదా? దొరికిపోతే మావాడు కాదనేది చంద్రబాబు నైజం. మరి లావు శ్రీ కృష్ణ ఎవరు? వేమిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మాగంటి సుబ్బరామిరెడ్డి, సుభాష్ కౌర్, గొలుసు పార్థసారథి, శ్రీనివాసులు ఏ పార్టీ నుంచి వచ్చారు. వీరిలో కొందరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు కదా. వారంతా కోవర్టులే?

–ఆర్‌కే రోజా, మాజీ మంత్రి

పేదల ఉసురు తీస్తున్న కల్తీ మద్యం

పేద ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి కల్తీ మద్యంతో కూటమి నాయకులు కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. మరో వైపు బెల్టుషాపుల పేరుతో ప్రతి గ్రామంలోను మద్యం మాఫియా విచ్చలవిడిగా లూటీ చేస్తోంది. తక్షణ చర్యలు తీసుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం.

– కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే

టీడీపీ నేతలే లిక్కర్ దందాలో ప్రధాన సూత్రధారులు

నారాసుర కల్తీ మద్యంతో పేద ప్రజల ప్రాణాలు పోతున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. రాష్ట్రవ్యాప్తంగా లైసెన్సు ఉన్న మద్యం దుకాణాల్లో కుటమి ప్రభుత్వమే కల్తీ మద్యం అమ్మిస్తూ పేద ప్రజల ప్రాణాలను బలిగొంటోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలలు సాధించిందేమంటే కల్తీ మద్యం తయారీ కోసం కుటీర పరిశ్రమల ఏర్పాటే.

– నూకతోటి రాజేష్, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త



శ్రీకాళహస్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు



వెంకటగిరిలో ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయానికి వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నాగలాపురంలో ర్యాలీ చేస్తున్న నూకతోటి రాజేష్ తదితరులు

కొట్టుకుంటూ.. తిట్టుకుంటూ..!

- వివాదాలకు కేంద్రంగా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- నిత్యం వాగ్వాదాలతో ఉద్రిక్త వాతావరణం
- ఇబ్బందిపడుతున్న కొనుగోలుదారులు

రేణిగుంట : భూముల రిజిస్ట్రేషన్‌లతో కళకళలాడే రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం ఏదో ఒక వివాదం తలెత్తుతూనే ఉంది. ఒక్కోసారి సిబ్బంది.. మరోసారి డాక్యుమెంట్ రైటర్ల వాగ్వాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారుతూనే ఉంటోంది. ఇదే క్రమంలో సోమవారం సైతం కార్యాలయంలోనే పరస్పరం దాడులు చేసుకునే దుస్థితి దాపురించింది. అటెండర్ తిరుమలేష్, డాక్యుమెంట్ రైటర్ల మధ్య వివాదం ముదిరి ఆఫీస్ రణరంగంగా మారిపోయింది. డాక్యుమెంట్ రైటర్ల పెత్తనం చేయడంపై అటెండర్ ప్రశ్నించడంతో గొడవ పెరిగింది. మమ్మల్ని అడ్డుకునేందుకు నువ్వెవరు అంటూ అటెండర్‌పై డాక్యుమెంట్ రైటర్లు దాడికి ప్రయత్నించారు. దీంతో సుమారు రెండు గంటలపాటు దూషణ పర్వం కొనసాగింది. ఇదే సమయంలో వివిధ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చినవారు నానా అవస్థలు పడ్డారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్, డాక్యుమెంట్ రైటర్ల వాగ్వాదం

డాక్యుమెంట్ రైటర్లదే హవా

సబ్ రిజిస్ట్రార్‌తో సన్నిహితంగా నడిచే కొందరు డాక్యుమెంట్ రైటర్లు ప్రస్తుతం రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో హవా సాగిస్తున్నారు. దాదాపు అన్ని రిజిస్ట్రేషన్లు డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయంతోనే జరుగుతున్నాయనే విమర్శలు వినపడుతున్నాయి. అందులోనూ ప్రస్తుత వివాదాల కారణంగా రిజిస్ట్రేషన్ త్వరితగతిన కావాలంటే డాక్యుమెంట్ రైటర్లు ఎంత చెబితే అంత చెల్లించాల్సి వస్తోందని క్రయవిక్రయదారులు వాపోతున్నారు. దీంతో అటు ప్రభుత్వం ఇటు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు భారీగా నష్టపోతున్నారు.

తొలి నుంచి అటెండర్, సబ్ రిజిస్ట్రార్ మధ్య గొడవలు

అటెండర్ తిరుమలేష్ నాలుగు నెలల క్రితం రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. అప్పుడు సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డి జాయినింగ్ లెటర్ తీసుకోకుండా ఇబ్బంది పెట్టాడని అటెండర్ తన కుల సంఘం నేతలను తీసుకురావడంతో వివాదం తలెత్తి పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. ఉన్నతాధికారుల జోక్యంతో తిరుమలేష్ జాయిన్ అయ్యారు. ఈ క్రమంలోనే వారం క్రితం అటెండర్ తిరుమలేష్ విధులకు ఆలస్యంగా వస్తున్నారని సబ్‌రిజిస్ట్రార్ హెచ్చరించడంతో మళ్లీ గొడవ మొదలైంది. దీనికితోడు వాటాల పంపకంలో తేడా రావడం కూడా వివాదాలకు కారణంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అటెండర్‌పై ఫిర్యాదు

అటెండర్ తిరుమలేష్‌పై సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డికి సోమవారం దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు ఫిర్యాదు చేశారు. కార్యాలయానికి వచ్చే వారితో తిరుమలేష్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, దూషిస్తున్నారని, బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అటెండర్ సైతం పలు ఆరోపణలు చేశారు. తన విధులను డాక్యుమెంట్ రైటర్లు, దళారులు అడ్డుకున్నారని చెప్పారు. దాడి చేసేందుకు యత్నించారని మండిపడ్డారు. క్రయవిక్రయదారుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారని ప్రశ్నించినందుకు దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 300 మీటర్ల దూరంలో ఉండాల్సిన డాక్యుమెంట్ రైటర్లు నిత్యం నిబంధనలను బేఖాతర్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు.



సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి ఇన్‌చార్జి అధికారులు

చంద్రగిరి: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పలువురు ఇన్‌చార్జి అధికారులను నియమిస్తూ వీసీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా వెటర్నరీ డీన్‌గా ఆర్.వి.సురేష్ కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం డీన్‌గా ఉన్న వీరబ్రహ్మయ్య పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. అలాగే డీఎస్‌ఏగా జె.వి.రమణ పదవీకాలం ముగియనుండడంతో ఆయన స్థానంలో సీనియర్ ప్రొఫెసర్ వి.వైకుంత రావును ఇన్‌చార్జి నియమించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ చెంగల్రాయులు పదవీకాలం 16వ తేదీతో ముగియనుంది. ఆయన స్థానంలో సీనియర్ ప్రొఫెసర్ కె.ఆదిలక్ష్మమ్మ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.

క్లుప్తంగా

బావిలో పడి వ్యక్తి మృతి


మనోహర్ (ఫైల్)

వెంకటగిరి రూరల్ : మండలంలోని జంగాలపల్లెలో ఆదివారం రాత్రి బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సర్పంచ్ పాలూరు ప్రమీల భర్త, వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాలూరు మనోహర్ (40) కొంత కాలంగా పెరాలసిస్ వ్యాధితో బాధడుతున్నాడు. ఈ క్రమంలో పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు గాలించినా ఆచూకీ దొరకలేదు. బావిలో పడి ఉంటాడనే అనుమానంతో మోటార్ ద్వారా నీటిని తోడేయగా మనోహర్ మృతదేహం బయట పడింది. ఆయన ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే విషయం తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెంకటయ్య మృతదేహం

చిల్లకూరు : మండలంలోని ఏరూరు రిజర్వాయర్ ప్రాంతంలో రొయ్యల గుంతల వద్ద సోమవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఏరూరు గ్రామంలో రొయ్యల గుంత వద్ద ఏరూరు అల్లీపురానికి చెందిన దాసరి వెంకటయ్య(33) పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రొయ్యలకు మేత వేసి వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గంటలు దాటితో బయటకు రావద్దు


వేదిక్ యూనివర్సిటీ అకడమిక్ భవన్ ఎదుట సంచరిస్తున్న చిరుత

తిరుపతి సిటీ: నగరంలోని వేదిక్ వర్సిటీ, ఎస్వీయూ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోందని విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని వర్సిటీ, అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఇప్పటికే వర్సిటీల్లో చిరుత సంచరించే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి వేదిక్ వర్సిటీలోని శైక్షిక (అకాడమిక్)భవనాల వద్ద చిరుత సంచరించిందని వెంటనే సెక్యూరిటీ అప్రమత్తమై విద్యార్థులకు సమాచారం అందించారని తెలిపారు. ఎస్వీయూ, వేదిక్ వర్సిటీలలో అటవీశాఖ సుమారు నాలుగు బోన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు సాయంత్రం ఆరు గంటలు దాటితే బయటకు రాకూడదని నిషేధాజ్ఞలు విధించారు.

ప్రజా ఉద్యమానికి దిశానిర్దేశం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాటం
- రచ్చబండ..ర్యాలీలు.. కోటి సంతకాల సేకరణ
- సన్నాహక సభలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : గత ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, కల్తీ మద్యంపై పోరాటానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని, ఉద్యమానికి ప్రజలను సైతం సిద్ధం చేయాలని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సోమవారం చంద్రగిరిలోని వైఎస్ఎంఆర్ కల్యాణ మండపంలో ప్రజా ఉద్యమ సన్నాహక సభ నిర్వహించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు, అన్యాయాలతో పాటు వైద్య విద్యను పేద ప్రజలకు దూరం చేసిన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి కనీసం 60వేల సంతకాలను నిర్దేశిత గడువులోపు సేకరించాలని కోరారు. పేదలకు మెరుగైన వైద్యం, నిరుపేదద విద్యార్థులకు వైద్య విద్యను అందించే అవకాశం వున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాలతో పాటు ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉచితంగా వైద్యవిద్య అభ్యసించేందుకు వీలుగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. అందులో 5 కళాశాలలను ప్రారంభించి తరగతులు నిర్వహిస్తుండగా మరో 12 కాలేజీలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఆయా నిర్మాణ పనులు పూర్తి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకువస్తే పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు లభిస్తాయని చెప్పారు. పేదలకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై చేపట్టిన పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అందుకే కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రతి పంచాయతీలో 500 నుంచి 600మందిని కలసి మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగిస్తే తలెత్తే నష్టాలను వివరించి సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు.


సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

షెడ్యూల్ ఇదీ...

మెడికల్ కాలేజీల అంశంపై ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ చేపడుతున్న ప్రజా ఉద్యమానికి పార్టీ కేంద్ర కార్యాలయం షెడ్యూల్ విడుదల చేసిందని మోహిత్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 10 నుంచి నవంబరు 22 వరకు దశల వారీగా నిరసనలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రాలు, నవంబరు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలన్నారు. నవంబరు 23నజిల్లా కేంద్రాలకు సంతకాల సేకరణ పత్రాలు తరలించాలని వెల్లడించారు. నవంబరు 22న జిల్లా కేంద్రాల నుంచి విజయవాడకు కోటి సంతకాల సేకరణ పత్రాలు పంపించాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, అర్జీదారులకు సంతృప్తికరంగా సమాధానం చెప్పాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జీదారులకు మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం డీఆర్‌ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, సుధారాణితో కలసి అర్జీలు స్వీకరించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు మొత్తం 290 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

కనీస వేతనం కోసం..

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి రూ.18,600 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.10వేలతో సరిపెట్టేస్తున్నారని మండిపడ్డారు. సూపర్‌వైజర్లకు రూ.21,600 వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.11వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 175 అర్జీలు

తిరుపతి క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 175 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించినట్లు వెల్లడించారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

దయచూపండి

పొలం పనులు చేసే సమయంలో ప్రమాదవశాత్తు వెన్నెముక దెబ్బతింది. దీంతో రెండు కాళ్లు పనిచేయడం లేదు. మంచానికే పరిమితమయ్యా. దివ్యాంగుల పింఛన్ ఇప్పిస్తే వైద్య ఖర్చులు పెట్టుకుంటా. దయచూపండి. ఎన్నిసార్లు కలెక్టరేట్ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోంది. ప్రభుత్వం నుంచి కొత్త పింఛన్లకు అనుమతి రాలేదని తిప్పి పంపేస్తున్నారు.

– మునస్వామి, దివ్యాంగుడు, చంద్రగిరి

టిప్పర్ ఢీకొని వైఎస్సార్‌సీపీ నేత మృతి

రామచంద్రాపురం : మండలంలోని సి.రామాపురం వద్ద సోమవారం టిప్పర్ ఢీకొని వైఎస్సార్‌సీపీ నేత సురేంద్రనాయుడు(63) మృతి చెందారు. వివరాలు.. కొత్తకండ్రిగకు చెందని సురేంద్రనాయుడు కూరగాయల సాగు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పంట ఉత్పత్తులను తిరుపతిలోని రైతుబజారులో విక్రయించి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా బండరాళ్ల లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్రనాయుడి కాలు నుజ్జునుజ్జుగా మారింది. క్షతగాత్రుడు తీవ్రమైన రక్తస్రావంతో ఘటనాస్థలంలోనే కొంత సమయంపాటు నరకయాతన అనుభవించాడు. అదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు ఆయనను కాపాడేందుకు విఫలయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

మోహిత్‌రెడ్డి పరామర్శ

వైఎస్సార్‌సీపీ నేత సురేంద్ర నాయుడు మృతి విషయం తెలుసుకున్న చెవిరెడ్డి మోహిత్ సోమవారం రాత్రి కొత్తకండ్రిగ గ్రామానికి చేరుకున్నారు. సురేంద్ర నాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.

ఎస్పీడీసీఎల్ సీఎండీగా శివశంకర్

తిరుపతి రూరల్ : ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీగా లోతేటి శివశంకర్ నియమితులయ్యారు. విజయనగరం జిల్లాకు చెందిన ఆయనను రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ ఐఏఎస్ క్యాడర్‌కు కేటాయించారు. దీనిపై ఆయన డీఓపీటీను ఆశ్రయించారు. ఎట్టకేలకు ఏపీ కేడర్‌కు పంపించారు. ఈ క్రమంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు రిపోర్ట్ చేశారు. అనంతరం ఎస్పీడీసీఎల్ సీఎండీగా ప్రభుత్వం నియమించడంతో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. అనంతరం ప్రధాన శాఖల ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు.

సంతోష్‌రావుకు వీడ్కోలు

ఎస్పీడీసీఎల్ సీఎండీగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సంతోషరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.


సీఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇంజినీర్లు

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

తిరుపతి రూరల్ : ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని, ప్రతి ఒక్క రైతుకు సోలార్ పవర్‌ను చేరువ చేస్తామని నూతన సీఎండీ లోతేటి శివశంకర్ తెలిపారు. ఆయన సోమవారం తిరుపతి నగరంలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

నేడు అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 జిల్లా జట్ల ఎంపిక మంగళవారం నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 సెక్రటరీ ఎస్.బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అండర్-19 ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 1-1-2007 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి జిల్లా కేంద్రంలోని శ్రీనివాస స్పోర్ట్స్ మైదానంలో జూడో బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. 15వ తేదీన ఉదయం 8.30 గంటలకు అన్నమయ్య జిల్లా, మదనపల్లి జెడ్పీ హైస్కూల్ మైదానంలో బాస్కెట్‌బాల్, హాకీ, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్ క్రీడా ఎంపికలుంటాయని తెలిపారు. 16వ తేదీన ఉదయం 8.30 గంటలకు చిత్తూరు జిల్లాలోని పలమనేరు జెడ్పీ హైస్కూల్ మైదానంలో వాలీబాల్, బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9440758047, 7013554202 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

స్త్రీనిధి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : స్త్రీనిధి రుణ వాయిదాల వివరాలతో కూడిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టర్ ద్వారా మహిళలు రుణ వాయిదాలను సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి, స్త్రీనిధి విభాగం అధికారులు హేమంత్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు. అలాగే కార్డియో పల్మనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, అధికారులు శాంతకుమార్, మంజుల, షేక్ ఖాజావలీ, మురళి పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా సేవ్ గర్ల్ చైల్డ్ అవేర్‌నెస్ వీక్ బ్యానర్‌ను ఆవిష్కరించారు.

వేర్వేరు చోట్ల బాణసంచా పట్టివేత


తనపల్లెలో బాణసంచా గోడౌన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట/చంద్రగిరి : జిల్లాలోని సూళ్లూరుపేట పట్టణం, చంద్రగిరి నియోజకవర్గంలోని తనపల్లెలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.7.5లక్షల బాణసంచాను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. వివరాలు.. సూళ్లూరుపేట పట్టణంలోని కోటపోలూరు రోడ్డులో ఉన్న గోడౌన్‌లో లైసెన్స్ లేకుండా నిల్వ చేసిన సుమారు ' 2.5 లక్షలు విలువ చేసే 85 బాక్సులు బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. అలాగే తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తనపల్లెలో కొల్లు దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి నిల్వ చేసిన రూ.5లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

బాధిత కుటుంబాలకు చేయూత


చెక్ అందిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు కుటుంబాలకు ఎస్పీ సుబ్బరాయుడు బాసటగా నిలిచారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విదులు నిర్వహిస్తూ గత నెల 12న అనారోగ్యంతో మరణించిన టీఎల్. వెంకటరత్నం సతీమణి టీ.ఉషాదేవికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వాహణలో సేవలందించి ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీస్ శాఖ ఎప్పటికీ మరిచిపోదన్నారు. వీరి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడంలో సంబంధిత శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందిని చెప్పారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వర పాల్గొన్నారు.

ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం

ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి స్పష్టం చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం మ్యాంగో మార్కెట్ యార్డు సమీపంలోని గరుడ వారధి వద్ద ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన దారులకు ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు ఓ పుష్పాన్ని అందించారు. హెల్మెట్- ప్రాణ రక్షక కవచం అంటూ నినాదాలు చేశారు. గరుడ వారధిపై గరిష్ట వేగ పరిమితి 30 కి.మీ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు సంజీవ్ కుమార్, సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు బాలాజీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.


హెల్మెట్ ఉపయోగాలను వివరిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి

మహిళా క్రికెట్ జట్టులో ఐదుగురికి చోటు


క్రికెట్ జట్టుకు ఎంపికైన గిరిష్మా సైనిరెడ్డి(వైస్ కెప్టెన్), ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణిత యాదవ్, కె.శుభశ్రీ

- వైస్ కెప్టెన్‌గా గిరిష్మా సైనిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఇటీవల ప్రకటించిన ఆంధ్రా ఉమెన్స్ అండర్-19 క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు చోటు సాధించినట్లు ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తెలిపారు. వీరిలో గిరిష్మా సైనిరెడ్డి (వైస్ కెప్టెన్), ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణిత యాదవ్, కె.శుభశ్రీ, ఎం.రుక్సార్ తబ్సమ్ వున్నారని తెలిపారు. వీరు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు బీసీసీఐ అండర్-19 ఉమెన్స్ టీ-20 చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన మహిళా క్రికెటర్లు బాగా రాణించి రంజీ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.


ఎం.రుక్సార్ తబ్సమ్

శభాష్ పోలీసు..!

- ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి
- డయల్ 100కు సమాచారం రావడంతో కాపాడిన పోలీసులు

చంద్రగిరి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెంటనే స్పందించారు. అక్కడికి చేరుకుని అతన్ని కాపాడి శభాష్ అనిపించున్నారు. తిరుపతికి చెందిన మురళీనాయక్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా కుటుంబ కలహాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తనువు చాలించాలని నిర్ణయించుకున్నారు. శ్రీనివాసమంగాపురం సమీపంలో రైల్వే ట్రాక్‌పైకి చేరుకున్నాడు. డయల్ 100కు ఫోన్ చేసి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన చావుకు ఎవరూ కారణం కాదని తెలిపారు. అప్రమత్తమైన కమాండ్ కంట్రోల్ అధికారులు చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూకోట్స్‌లో విధుల్లో వున్న కానిస్టేబుల్ చిరంజీవి, కిరణ్, శ్రీనుఫోన్ నంబరు ఆధారంగా మురళీ నాయక్ వద్దకు చేరుకున్నారు. అతనికి నచ్చజెప్పి క్షేమంగా తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కౌన్సిలింగ్ అనంతరం ఇంటికి పంపించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.


ఆత్మహత్యకు యత్నించిన మురళీ నాయక్‌తో మాట్లాడుతున్న చంద్రగిరి పోలీసులు

మనమూ 'స్పేస్' తీసుకుందాం

- అంతరిక్ష వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఎయిర్ కమాండర్ రాజేష్


విజేతలకు బహుమతి, సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ స్పేస్‌లో బలీయమైన శక్తిగా ఎదగాలంటే యువ శాస్త్రవేత్తలు తయారు కావాల్సిన అవసరం ఉందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ అండ్ కమాండర్ రాజేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన బ్రహ్మప్రకాష్ హాలులో సోమవారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ ఎండ్ కమాండర్ రాజేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ యువతరం సాఫ్ట్‌వేర్‌వైపు చూస్తున్నారని, ఇస్రోలో చేరితే ఉద్యోగంతో పాటు దేశానికి సేవలు అందించే అవకాశం దక్కుతుందని వివరించారు. భారత అంతరిక్ష కార్యక్రమాలకు డాక్టర్ హోమీజే బాబా బీజం వేస్తే డాక్టర్ విక్రమ్ సారాభాయ్, ప్రొఫెసర్ సతీష్ ధవన్, ఏపీజే అబ్దుల్‌కలాం, డాక్టర్ కస్తూరి రంగరాజన్ లాంటి ఎంతోమంది శాస్త్రవేత్తలు భారత అంతరిక్ష కార్యక్రమాలను ప్రపంచం అబ్బురపడేలా ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. సుమారు మూడు రాష్ట్రాల్లోని తొమ్మిదో ప్రాంతాల్లో అంతరిక్ష కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం శుభపరిణామమని కొనియాడారు. అనంతరం ఈఎస్ పద్మకుమార్ మాట్లాడుతూ 1999 నుంచి అంతరిక్ష వారోత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని, ఏటా అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం గురించి ప్రజలకు వివరించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో గగన్‌యాన్-1 ప్రాజెక్ట్, చంద్రయాన్-4, వీనస్ (శుక్రయాన్) వంటి ప్రయోగాలతో అంతరిక్షంలో సత్తాచాటుతామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతితోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ రమేష్ కుమార్, అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చైళియన్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.